# చీలిన దారులు

హిరణ్యకశిపుని ఇంట్లోనే ప్రహ్లాదుడు పుడతాడు. ఆంధ్ర సాహిత్య పరిషత్తు పక్కనే నవ్యసాహిత్య పరిషత్తు పుట్టింది కాకినాడలో. విశ్వనాథ కవిరాజుగారి "అభినవ ప్రహ్లాద" నాటిక జ్ఞాపకం వస్తుంది!

అది, 'ఊపర్‌వాలా' అంటూ ఒకడుంటే వాడి లీల గాబోలు!

1935 అనుకుంటాను.

కాకినాడ టౌన్‌హాల్ ప్రాంతంలో జిల్లా కాంగ్రెసు సభలు ఏర్పరిచారు. నాగేశ్వరరావు పంతులుగారు వగైరా కాంగ్రెసు పెద్దలు ఎందరో విచ్చేశారు. రెండు రోజులు బ్రహ్మాండమైన సందడి.

శివశంకరశాస్త్రిగారు కాంగ్రెసువాది: ఖద్దరుధారి. తనకు కాంగ్రెసులో వున్న పలుకుబడి ఉపయోగించి మనవరాలి పెళ్ళిలో మామ్మగారి

నందికేశుడి నోములా ఆ కాంగ్రెసు నీడలో అభినవాంధ్ర కవి సభలు కూడా జరుపుకోడానికి అనుమతి సంపాదించారు.

అప్పటి ప్రభుత్వం మీద కాంగ్రెసు తిరగబడ్డట్టే — అప్పటి సాహిత్య వ్యవస్థమీద తిరుగుబాటు చేసి ప్రజల భావాలు పట్టించుకునే కొత్త కవులమీద లోలోపల కాంగ్రెసువారికి సానుభూతి వుంది. కనక — వచ్చిన కవి పండితులకు ఆతిథ్యమివ్వడానికి కాంగ్రెసు సంతోషంగా ఒప్పుకుంది.

ఫలానా రోజున కాంగ్రెసు పెండాల్లో నవకవుల సమావేశం జరుగు తుందని ప్రకటన వెలువడింది.

సభాస్థలం వెతుక్కుంటూ మెయిన్ రోడ్డులో బయలుదేరాను. ఎదు రుగా శ్రీపాదవారు.

ఆయన నవ్యసాహిత్యాభిమానే అయినా సాహితీసమితి అంటే చుక్కెదురు. ఖద్దరు కాంగ్రెసు అంటే అగ్గిమీద గుగ్గిలం! వేరే సొంత పనిమీద కాకినాడవచ్చి రోడ్డుమీద తటస్థపడ్డారు. తమాషా చూద్దాం రండని నేను బలవంతం చెయ్యగా నాతో కాంగ్రెసు ఆవరణలోకి రావడానికి ఒప్పుకున్నారు.

మధ్యాహ్నం రెండు గంటలు.

సభాస్థలం నిర్జనంగా ఉంది.

పెద్ద సభావేదిక. ఎదట పరిచిన బరఖాలు — అంతే. ఒక పలం టీరును పిలిచి అడిగితే — సూర్యారావుపేటలో కృష్ణశాస్త్రిగారి ఇంటి ఎదర కవుల బస అనీ, సభ సాయంత్రం అయిదు గంటలకనీ తెలిసింది.

శాస్త్రిగారి ఇంటి ఎదుట ఒక వెలం దొరగారి ఇల్లు.

కవులమీద అభిమానంకొద్దీ ఆయన ఆ రెండు రోజులూ ఇల్లు ఖాళీ చేసి వారి పరం చేశారు.

వెళ్ళాం. ఫెళ్ళుమంటూ కవుల బస. హాస్యోక్తులతో, సరాగాలతో గలగల లాడుతోంది.

నిద్రనుంచి సగం లేచినవాళ్ళూ, నిండా లేచినవాళ్ళూ, 'టాయిలెట్లో' నిమగ్నమైన వాళ్ళూ, చదవవలసినవి నూరుకునేవాళ్లూ ఇంటినిండా ఉన్నారు.

సద్దుమణిగిన తర్వాత వాకిట్లో అంతరంగ సమావేశం — తెలికిచర్ల, తల్లావజ్ఝల, మొక్కపాటి, వేదుల వగైరా చర్చలకు, సంప్రతింపులకు ఉపక్రమించారు. చర్చల సారాంశం ఇట్లా తేలింది.

1. ఇదివరకటి పేరు చాలా పొడుగయిపోయింది. దాన్ని మార్చి 'నవ్య సాహిత్య పరిషత్తు' అందాం.

2. ఈ సంవత్సరానికి పంచాగ్నులవారు అధ్యక్షులు; కార్యదర్శి వెంకటరత్నంగారు కార్యవర్గ సభ్యులను తర్వాత ప్రకటిస్తాం.

3. ఈ పరిషత్తు ఆశయం ముఖ్యంగా భాషలో, భావంలో కొత్త చూపు.

4. ఈ సంస్థ తరపున మూడునెలల కొకసారి 'ప్రతిభ' అనే సాహిత్య సంచిక వెలువరించాలి.

అంతా ఆమోదించారు.

బహిరంగ సభాస్థలానికి అంతా బయలుదేరాం. చూస్తే సుబ్రహ్మణ్య శాస్త్రిగారు లేరు. అక్కడ కొందరు ఖద్దరుధారుల 'డామినేషన్' చూసి ఎప్పుడో లేచి వెళ్ళిపోయుంటారు అనుకున్నాను.

సభా ప్రారంభం అయింది.

జనం కిటకిటలాడుతున్నారు.

కాంగ్రెసువారు చాలామంది హాజరై గాంధీ టోపీలతో వికసిత పుండరీకాల్లా విరాజిల్లుతున్నారు.

సభాధ్యక్షులు ఆదినారాయణశాస్త్రిగారు.

నవ్యసాహిత్యాన్ని మనసునిండా సమర్థించే ఏకైక ప్రాచీన పండితుడాయన.

బక్కపల్చగా, పొట్టిగా, నిరాడంబరంగా ఉన్న శాస్త్రిగారు అధ్యక్షస్థానాన్ని "అలంకరించ"లేదుగాని నవ్యసాహిత్య ఉద్యమాన్ని అలంకరించి నవ్యసాహిత్యం "ఉందా లేదా?" అమోఘంగా వివరిస్తూ ఉపన్యసించి కూర్చున్నారు.

వరసగా నాటి యువకులు, మధ్య వయస్కులు ఒక్కొక్కరే తమ రచనలు ఉత్తేజకరంగా చదివారు.

"యావదాంధ్ర యతిప్రాసమహాసభ" అనే వ్యంగ్య రచన చదివాను నేను.

సభలో ఎదురుగా కాంగ్రెసులో లీనమై కవిత్వం ఒదులుకున్న కొడాలి ఆంజనేయులుగారు కనబడగానే విశ్వనాథవారి "ఆతడు తోడుగల్గినను అచ్చముగా కలకండ లచ్చులం బోతలు పోసి యుండెదము పోతనగారి విధాన..." అన్నమాట జ్ఞాపకం వచ్చి నవ్యసాహిత్యం ఎంత గొప్ప కవిని కోల్పోయిందీ అనిపించింది.

రాత్రి ఎనిమిది గంటలకు సభ సమాప్తమయింది.

మర్నాడు శివశంకరుల 'పద్మావతీ చరణ చారణ చక్రవర్తి' పద్య నాటిక ప్రదర్శనం అన్నారు. ఆగిపోయాం.

ఉదయం మళ్ళా అక్కడే సమావేశం.

నాగేశ్వరరావు పంతులుగారు 'సర్వశుక్లా సరస్వతీ' అన్నట్లు నిలువునా తెల్లని దుస్తులతో నగేశ్వరునిలా నిలబడి వర్తమాన కాలపు రాజకీయ పరిస్థితినీ, సాహిత్యాన్నీ, సమన్వయిస్తూ ప్రసంగించారు. నా పక్కనే కూర్చున్న శ్రీశ్రీ, పంతులుగారి ప్రసంగంలో, వర్తమానకాలాల్ని ఇరవై ఏడు లెక్కవేసి చూపిస్తే సరదాగా నవ్వుకున్నాం. నేను పంచాగ్నుల వారి 'ఉందా లేదా'లను మనసులో లెక్కవేసినా ఇన్నీ అని తేల్చలేకపోయాను.

రాత్రి ఎనిమిది గంటలకు పద్మావతి నాటిక.

తెర ఎత్తారు.

బి. వి. నరసింహారావు పద్మావతిగా ప్రత్యక్షమై చేసిన నాట్యం సభ్యుల్ని పరవశుల్ని చేసింది. వెంటనే అనంతం మధుర కంఠం జయదేవుడుగా ప్రవేశించింది.

పాత్రల సంభాషణ అంతా పద్యాల్లోనే.

కొత్త ప్రయోగం. అర్థంకాని అలగా జనం గోలచేస్తే కృష్ణశాస్త్రి గారు తెర ముందుకు వచ్చి నిలబడ్డారు. నిశ్శబ్దం! ఆయన తియ్యని కొరడా దెబ్బలు తిని జనం అణిగిమణిగి కూర్చున్నారు.

నాటిక ఒక మధుర స్వప్నంలా ముగిసిపోయింది.